17వ వసంతంలోకి
# సూర్య
రంగారెడ్డి-వికారాబాద్-మేడ్చల్
శనివారం 20 జనవరి 2024 పేజీలు : 10

## పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వెల్లడి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జనవరి19)ఃరాబోవు పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ, ఓటర్ నమోదు, సవరణలుపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలను రాజకీయ పార్టీల సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా పార్లమెంటు ఎన్నికలలో సహకరించాలని కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా ఈనెల 20, 21 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

మిగతా 3లో

## బిఎంసి కార్యాలయంలోని అధికారులతో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సమీక్ష



బాలాపూర్ మేజర్ న్యూస్(జనవరి 19); బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సుమన్ రావు తోపాటు అధికారులు,లతో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సమీక్ష సమావేశం. మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సుమన్ రావు తోపాటు అధికారులు లతో కార్పొరేషన్లు పన్నులు, బడ్జెట్ కేటాయింపులు సమస్యల గురించి చర్చించారు. అదేవిధంగా తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ కు పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అదనపు కలెక్టర్ పారిజాతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిగురింత నరసింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు బొయపల్లి గోవర్ధన్ రెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి

## సోమవారం వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశం



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్ (జనవరి19)ః కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి సంబంధిత అధికారులందరూ అవసరమైన ప్రతిపాదనలను సోమవారం వరకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన కొడంగల్ నియోజ కవర్గం అభివృద్ధిపై శాఖల వారిగా సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి పరిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రికి వాటర్ ప్లాంట్, రెండు అంబులెన్సులు, జనరేటర్ తో పాటు అవసరమైన సిబ్బంది కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ సెంటర్ ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. రోడ్లు మరియు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా అవసరమైన సింగిల్ డబుల్ రోడ్లతో పాటు జిపి బిల్డింగ్స్, కమ్యూనిటీ హాల్స్, వంతెనలు, అతిథి గృహం కొరకు ప్రతిపాదనను సిద్ధం చేయాలని సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ద్వారా వ్యవసాయం మరియు డొమెస్టిక్ అవసరాల మేరకు అవసరం మేరకు కొత్త ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా కొడం గల్ నియోజకవర్గానికి అవసరమైన సాగు త్రాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఉద్యానవన శాఖ ద్వారా రిసర్చ్ సెంటర్ ఏర్పాటుకు 50 ఎకరాల స్థల సేకరణ వారం రోజులలో జరగాలని అన్నారు. పశుసంవర్ధక శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే వ్యవసాయ శాఖకు సంబంధించిన డిప్లొమా కళాశాల ఏర్పాటుకు నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియో జకవర్గంలో జిల్లా స్థాయి తరహాలో అభివృద్ధి పరిచేందుకు అన్ని ప్రతిపాదనలను సిద్ధం చేసి కడ ప్రత్యేక అధికారికి సోమవారం వరకు అంద జేయాలని అన్నారు. ముఖ్యమంత్రి నియో జకవర్గంలో పనిచేసే అధికారులందరూ పూర్తి బాధ్యతతో చురుకుగా పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, కడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



### కమలం పార్టీ జిల్లా దళపతిగా...

## నర్సింహ్మారెడ్డి నాలుగో సారి

- మరోసారి పార్టీ పెద్దల విశ్వాసాన్ని చూరగొన్న బీఎన్ఆర్ - క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ పట్ల విధేయుడిగా పేరు - సుదీర్ఘకాలంగా ఆ పదవిలో కొనసాగిన నేతగా రికార్డు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (జనవరి 19) : ఇప్పటికే వరుసగా మూడు సార్లు రంగారెడ్డి జిల్లా కమలం పార్టీ అధ్యక్షునిగా పని చేసిన బొక్కనర్సింహ్మారెడ్డికే... ఆ పార్టీ మరోసారి అవకాశం ఇస్తూ... శుక్రవారం నాడడు నాలుగో సారి కూడా అవకాశం కల్పించి ప్రకటన విడుదల చేసింది. క్షేత్రస్థాయిలో యువకార్యకర్తలను ఎల్లప్పుడూ ప్రోత్సహించే ఆదర్శనేతగా పేరుపొందిన నర్సింహ్మారెడ్డి... ప్రజల శ్రేయస్సు కోసం, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటాడు. అను నిత్యం కేడర్‌కు అందుబాటులో ఉంటూ.. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు అన్ని విభాగాలకు చెందిన నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న నర్సింహ్మారెడ్డే ఆ పదవికి సరైన నాయకుడని పార్టీ భావించింది. స్వశక్తితో రాజకీయాల్లో ఎదిగిన నేత

1965లో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నర్సింహ్మారెడ్డికి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. చిన్ననాటి నుంచి జాతీయవాద భావజాలాన్ని అలవర్చుకోవడంతో పాటు పదో తరగతి చదువుతున్న సమయంలోనే ఆర్ఎస్ఎస్ వైపు ఆకర్షితుడైన బీఎన్ఆర్ 1981 నుంచి 84 వరకు ఏబీవీపీలో సైతం పని చేశాను. 1984లో బీజేపీలో చేరడం, ఏడాది కాలంలోనే కందుకూరు మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికై పార్టీ పెద్దల మనస్సులు గెలుచుకున్నాడు. 1992 నుంచి ఎనిమిదేళ్ల పాటు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా... 2000 నుంచి తొమ్మిదేళ్ల పాటు కిసాన్‌మోర్చలో వివిధ హోదాల్లో పనిచేసిన బీఎన్ఆర్ 2009 నుంచి 2016 వరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగాడు. ఇలా అనేక పదవులు దక్కించుకున్న నర్సింహ్మారెడ్డి... 2016లో తొలిసారిగా జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికై... వరసగా మూడు సార్లు తన పదవికాలాన్ని విజయవంతంగా పూర్తి చే సుకున్నాడు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి తన పదవిని కొనసాగిస్తూ... పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువరించడంతో నర్సింహ్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# వాసుదేవ్‌పూర్‌లో 11 మేకలు చోరీ

**-ఇంటి బయట తలుపుకు గడియ పెట్టి నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన మేకలు దొంగిలించిన గుర్తుతెలియని దుండగులు**

**-గురువారం రాత్రి 11 గంటల తర్వాత చోటుచేసుకున్న సంఘటన -కడ్తాల్ పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబీకులు**



కడ్తాల్, మేజర్‌న్యూస్ (జనవరి 18): కడ్తాల్ మండలం వాసుదేవ్‌పూర్ గ్రామంలో గుర్తుతెలియని దుండగులు నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన 11 మేకలకు అపహరించిన సంఘటన గురువారం రాత్రి 11 నుండి 12 గంటల మధ్య చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ హర్యానాయక్ తన పక్కనే ఉన్న షెడ్డులో తన మేకలను ఉంచి కుటుంబంతో కలిసి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వాహనంలో వచ్చిన దుండగులు హర్యానాయక్ ఇంటి తలుపుకు బయటనుండి గడియపెట్టి 11 మేకలను అపహరించుకుపోయినట్లు తెలిపారు. మేకల అరుపులు విన్న హర్యానాయక్‌తో పాటు ఆయన కుటుంబీకులు బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా ఇంటి తలుపులు బయటనుండి గడియపెట్టి ఉండడాన్ని గమనించి సమీప కుటుంబీకులకు ఫోన్‌ద్వారా తెలుపినప్పటికి దుండగులు మేకలను గుర్తుతెలియని వాహనంలో అపహరించుకుపోయినట్లు బాధిత కుటుంబీకులు వాపోయారు. ఈ మేరకు గ్రామస్థులు , కుటుంబీకులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ హరిశంకర్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా కడ్తాల్ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్దకు చేరుకొని వాహనాలను పరిశీలించారు. అయినప్పటికి దొంగల ఆచూకి లభించకపోవడంతో శుక్రవారం బాధిత కుటుంబీకులు కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా కడ్తాల్ మండలం పెద్దరెడ్డిచెరువు తాండలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు 13మేకలు అపహరించుకుపోయినట్లు తెలిసింది. ఈ మేరకు వాసుదేవ్‌పూర్‌లో జరిగిన మేకల దొంగతనంపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి నిరుపేద గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ పాత్లావత్ నరేందర్‌నాయక్, ఎంపిటిసి సభ్యులు పాత్లావత్ లచ్చిరాంనాయక్, గ్రామస్థులు కోరారు.

# సూర్య దినపత్రిక నూతన క్యాలండర్ ఆవిష్కరణ



కీసర,మేజర్ న్యూస్:ప్రజల పక్షాన నిరంతరం ప్రశ్నించేతత్వంతో ముందుకు పోతున్న సూర్య దినపత్రిక 2024 నూతన క్యాలెండర్ శుక్రవారం ఆవిష్కృతమైంది. కీసర మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు సూర్య పత్రిక రాస్తున్న కథనాలపై ప్రత్యేకంగా ప్రశంసించారు. కీసర సీఐ వెంకటయ్య, నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి, గోధుమకుంట సర్పంచ్ అకిటి మహేందర్ రెడ్డి, ఎంపిటిసి మంచాల ప్రవీణ్ కుమార్, కీసరగుట్ట ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు వంగేటి పర్వత్ రెడ్డి, జనగాం మహేంద్ర భూపతి, మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణల చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది.













## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన గ్రామ ప్రథమ పౌరురాలు ఏనుగు కావేరి మచ్చేందర్ రెడ్డి



ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(జనవరి, 19): మండలంలోని అవుశాపూర్‌గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాన్ని ఆ గ్రామ ప్రథమ పౌరురాలు ఏనుగు కావేరి మచ్చేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి, అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వీరికి అందించే పాలు, కోడిగుడ్లు, బాలామృతం, భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం కేంద్రంలోని సమస్యలను టీచర్ ను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కావేరీ మచ్చేందర్ రెడ్డి చిన్నారులతో కలిసి కూర్చొని ముచ్చటించి సరదాగా గడిపారు. బాలామృతం ప్యాకెట్లు, గుడ్లను కావేరి మచ్చేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

# జిల్లాలోని మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలకు అన్ని రకాల చర్యలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతం






మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(జనవరి,19): హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి ఆయా ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వో లతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతం మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ సూచనలు, సలహాల ప్రకారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికార యంత్రాంగం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి నుంచే అధికారులకు అవసరమైన సూచనలు చేశామని వీడియో కాన్ఫరెన్స్ లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి ఫారం6,7,8 లను ఈనెల 22వ తేదీ వరకు పూర్తి చేస్తామని కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్ లో తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ సంబంధించి కూడా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఏడు పార్లమెంట్ నియోజకవర్గాలకు కలువుకొని పూర్తి స్థాయిలో అందచేసేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని అధికారుల ద్వారా అందచేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని... అందులో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకొని అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్ లో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఈఆర్వోలు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 22న చత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో శ్రీ రామోత్సవం - లక్ష దీపోత్సవం

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవి దేవాలయం శ్రీ రామజన్మ భూమి తీర్ధ క్షేత్ర వనస్థలిపురం వారి ఆధ్వర్యంలో అయోధ్య శ్రీ రామ జన్మభూమి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా శ్రీ రామోత్సవం, లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవి ఆలయ కమిటి శ్రీ రామ జన్మభూమి తీర్ధ క్షేత్ర వనస్థలిపురం ఛైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 22వ తేదీ సోమవారం సాయంత్రం ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్ నాగార్జు స్కూల్ దగ్గర శ్రీ రామోత్సవం, లక్ష దీపోత్సవం కార్యక్రమం ఉంటుందని, వనస్థలి వేద పండితులచే వేద ఘోష, శ్రీ రామజ్యోతి మహిళలచే లక్ష దీప ప్రజ్వలన, ఎస్.కె.ఎన్ కళాక్షేత్రం డాన్స్ అండ్ మ్యూజిక్ స్కూల్ వారిచే నృత్య సంగీతం, దుష్టుల చర్య నుండి దేవాలయాలకి విముక్తి కలిగించిన వీర కర సేవకులకు సన్మానం, పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీ రామ పూజ కార్యక్రమాలు జరుగుతాయని వనిపల్లి వివరించారు.

# నేడు జిల్లాలో ఎస్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్...



**- ఈ నెల 29న ఎస్ఎంసి చైర్మెన్,వైస్ చైర్మెన్ ఎన్నిక - డీఈఓ రేణుకాదేవి వెల్లడి**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (జనవరి19)ః జిల్లాలో ఎస్ఎంసి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ నేడు ప్రతి పాఠశాలలో నోటీసు ఇవ్వడం జరుగుతుందని డీఈఓ రేణుకాదేవి తెలిపారు.అదే విధంగా నేడు పాఠశాలలో ఉన్నటువంటి తల్లిదండ్రుల జాబితా కూడా నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. 22 -1- 2024 నాడు మరియు 23 -1 -20 24 నాడు తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి ఏమైనా ఉంటే పరిష్కరించడం జరుగుతుందన్నారు. 24-1-2024 బుధవారం నాడు ఎస్ఎంసి సభ్యుల ఎన్నిక కొరకు తల్లిదండ్రుల తుది జాబితా ఖరారు చేసి అట్టి జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందని ఆమె తెలిపారు. 29- 1 -2024 నాడు ఎస్ఎంసి సభ్యుల ఎన్నిక ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారని, తరువాత అదే రోజు మధ్యాహ్నం 1:30 కి ఎస్ఎంసి చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు. ఈ విధంగా ఎన్నికైన ఎస్ఎంసి మెంబర్స్ యొక్క మొదటి సమావేశాన్ని 29-1-2024 నాడు మధ్యాహ్నం రెండు గంటల నుండి 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. అయితే ఇట్టి ఎన్నికల్లో ప్రతి తరగతి నుండి ముగ్గురు చొప్పున తల్లిదండ్రులను ఎన్నుకుంటారని, ఈ ముగ్గురిలో ఇద్దరు మహిళలు కచ్చితంగా ఉండాలన్నారు. ఈ విధంగా ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతులకు గాను 15 మందిని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుండి ఏడు తరగతులకు గాను 21 మందిని అదేవిధంగా హై స్కూల్ కి సంబంధించి 6 నుండి 8 తరగతిలో గాను 9 మందిని మెంబర్స్ గా ఎన్నుకుంటారని పేర్కొన్నారు. వీరిలో నుండే చైర్మన్, వైస్ చైర్మన్ గా ఎన్నుకుంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ఎం.ఈ.ఓ లకు ఎం .ఎన్ .ఓ లకు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం. లకు అందరికీ జిల్లాలో ఉన్నటువంటి ప్రధానోపాధ్యాయులు అందరికీ ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ నెల 29వ తారీఖు నాడు ఎన్నికను సజావుగా నిర్వహించి 30 వ తారీఖు నాడు అట్టి లిస్టులను డీఈఓ ఆఫీసుకు అందించాలని ఆమె సూచించారు.

## ఇచ్చిన హామీని నెరవేరుస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణ పై కమిటీ ఏర్పాటు

**బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు గాదె మైపాల్ ముదిరాజ్**



కుల్కచర్ల, మేజర్ న్యూస్(జనవరి19): అసెంబ్లీ ఎన్నికల్లో ముందు ఎస్సీ వర్గీకరణ పై కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవ డంహర్షించదగ్గ విషయం అని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు గాదె మైపాల్ ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగానిర్వహించిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణ పై కమిటీని వేస్తామని హామీ వచ్చిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీఅందుకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయం తీసుకునేందుకు ఎస్సీ వర్గీకరణ పై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారని ఎస్సీ వర్గాల తరఫున దేశ ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతున్నట్లుఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**మొదటిపేజీ తరువాయి...** ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలతో ఎల్ ఓ లు అందుబాటులో ఉంటారని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అలాగే స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. జిల్లాలో ప్రకటించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురితమైనందున ఇందులో ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే ఈనెల 22వ తేదీ వరకు తెలియపరచాలన్నారు. మార్పులు చేర్పులు, షిఫ్టింగులు, ఓటరు నమోదుకు ఫామ్ 6,7,8 ద్వారా దరఖాస్తు చేసుకోనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని రాజకీయ ప్రతినిధులను ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, వికారాబాద్ తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ సెక్షన్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి



చౌడాపూర్, మేజర్ న్యూస్ (జనవరి 19)ః చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి తండా, పుర్సంపల్లి గ్రామలలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేష్ చంద్ర ఆదేశానుసారంగా వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరవేసే విధంగా అవగాహన కల్పించడం కార్యక్రమం యొక్క ఉద్దేశమని తెలియజేశారు. ఆయుష్మాన్ భారత్, పిఎం జన ఆరోగ్య యోజన పథకాలు ప్రజల ఆరోగ్యానికి సంబంధించినవి అని అందుకే అందరూ ఆభా కార్డ్స్ జనరేట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్డ్స్ ను మీ గ్రామంలోని ఏఎన్ఎం లేదా ఆశ వర్కర్ జనరేట్ చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచులు శ్వేంకటయ్య, ఉమ్లా నాయకక్, బ్రహ్మానందరెడ్డి ఎంపిటిసి రాములు, ఎంపీహెచ్ఈఓ, రెండు గ్రామాల పంచాయతీ సెక్రటరీలు గుర్నాథ్ రెడ్డి, నవీన్ కుమార్ స్థానిక ఏఎన్ఎమ్స్ పుష్పలత, ఇందిర, అశ్విని నాయక్, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, నర్సింగమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థి లక్ష్మి మృతికి కారణమైన ఆర్ఎంపి డాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య**



దోమ, మేజర్ న్యూస్ (జనవరి 19)ః దోమ మండల పరిధిలోని పాలేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి మృతికి కారణం అయినా ఆర్.ఎం.పి డాక్టర్ శివరాంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, ఆయనకున్న ఆర్ఎంపి సర్టిఫికెట్లు వెంటనే రద్దు చేసి క్లినిక్ ను సీజ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమ మండలం, పాలేపల్లి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న లక్ష్మి అనే అమ్మాయి తనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆర్ఎంపీ డాక్టర్ ఆగు శివరాం దగ్గరికి వైద్యం చేయించుకోవడానికి వెళ్లగా ఆయనకు తెలిసి తెలియని వైద్యంతో కాలం చెల్లిన టాబ్లెట్ లు ఇవ్వడం వల్ల అమ్మాయి ఆ టాబ్లెట్స్ వేసుకోగా వెంటనే రియాక్షన్ అయ్యి మరణించిందన్నారు. విద్యార్థిని మరణం పై పూర్తిస్థాయి విచారణ జరిపి అమ్మాయి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి తెలిసి తెలియని వైద్యం చేస్తున్న అనేక మంది డాక్టర్ల జిల్లాలో అనేక మంది పనిచేస్తున్నారు. వారి పనితీరుపై జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణ లోపం కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది. పర్యవేక్షణ లోపం వల్ల ఇలాంటి ఘటనలు అనేక జరుగుతున్న చూసి చూడనట్లుగా వ్యవహరించడం వల్ల అనేకమంది అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని అన్నారు. గతంలో బొంపల్లి గ్రామంలో ఇలాంటి ఘటన జరిగింది. ఇప్పటికైనా అలాంటి వైద్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు.

## ఓటు నమోదుకై అవగాహన కల్పించాలి

**చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు**



చౌడాపూర్, మేజర్ న్యూస్ (జనవరి 19)ః ఓటర్ నమోదుకై ప్రజల్లో అవగాహన కల్పించాలని తహసిల్దార్ ప్రభులు అన్నారు. శుక్రవారం బిఎల్ఓ లకు, ఆ గ్రామ పంచాయతీ సెక్రెటరీలకు,అంగన్వాడి టీచర్స్ కు,అధికారులకు ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన యువతను,ఏమైనా తదుపరి మార్పులు చేసుకోవడం కోసమై మరోసారి అవకాశాన్ని కల్పిస్తున్నారని శనివారం రోజు ప్రతి గ్రామంలో బిఎల్ఓలో, అధికారులు ప్రజలకు సూచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లింగప్ప,రెవెన్యూ అధికారులు వెంకటగిరి, జగన్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన భాస్కర్ గౌడ్



దోమ,మేజర్ న్యూస్ (జనవరి 19)ః ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విమార్కను అయినాపూర్ గ్రామ యువజన సంఘ నాయకులు భాస్కర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసిశారు. ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి సారాధ్యంతో తమ గ్రామ అభివృద్దికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన స్పందిస్తూ అభివృద్ధికి నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్, నల్ల సాయిలు, బోయిని రఘు, గార్లపల్లి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి సన్మానం



బషీరాబాద్ మేజర్ న్యూస్ (జనవరి 19)ః బషీరాబాద్ మండలం పరిధిలోని మంతం గౌడ్ తండా వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ అనుష బాయ్ ఉపసర్పంచ్ దన్ సింగ్ తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు గోపాల్ , మిథున్,తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22 పవిత్రమైన రోజు



దోమ, మేజర్ న్యూస్ (జనవరి 19)ః రామ జన్మభూమి అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు సన్నాహాలు చివరి దశలో ఉన్నాయని ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని వీక్షించేందుకు యావత్ భారతదేశంతో పాటు ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తుందని చందు పేర్కొన్నారు. జనవరి 22న ప్రధాన ఘట్టమైన ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. పవిత్రమైన రోజున ప్రతి ఒక్కరూ మద్యానికి మాంసానికి దూరంగా ఉండాలని తెలిపారు.

# కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం

### రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. జంగారెడ్డి



కందుకూరు, మేజర్ న్యూస్ (జనవరి 19): కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జంగారెడ్డి విమర్శించారు. కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 తారీకు వరకు మూడు సంఘాలు సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రజల వద్దకి వెళ్లి ప్రచారం కొనసాగించాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక కర్షక జిల్లా సదస్సు కందుకూరులోని పాషా నరహరి స్మారక భవనంలో దుబ్బాక రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తూ దేశంలో పేదరికం దారిద్రాన్ని పెంచి పోషించే ప్రయత్నంలో ఉంటూ కార్పోరేట్ల కొమ్ముగాస్తూ ప్రజలపై పెను బారాల్ని మోపి దుర్మార్గపు పాలన కొనసాగించడం దౌర్భాగ్యం అని అన్నారు. ప్రజా వ్యతిరేకత పక్కదారి పట్టించే దానికోసం మతానికి రాజకీయ రంగు పులిమి పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలని, రైల్వే, విమానం, నవరత్నాల కంపెనీ లను తెగనమ్మి ప్రభుత్వ రంగం లేకుండా చేశాడని ఆరోపించారు. రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికుల్ని, కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారని, దీనివల్ల దేశంలో ప్రజలు దుర్భరస్థితిగతులను అనుభవిస్తుంటే తను మాత్రం మత రాజకీయాలతో మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బం గడిపే ప్రయత్నాలు చేస్తున్నాడు 4 లేబర్ కోడుల బిల్లుతో కార్మిక రంగం కుదేలైపోయి రోడ్డున పడే పరిస్థితి వస్తున్నాయని, అట్లాగే ఉపాధి హామీ పని దినాలు తగ్గించేసి ఉపాధి లేకుండా చేసే ప్రయత్నం పెద్ద ఎత్తున కొనసాగుతుందన్నారు. రైతాంగాన్ని నల్ల చట్టాల పేరుతో దివాళ తీయించి కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ పెట్టుబడిదారుల కొమ్ముగాసే ప్రయత్నం చేయటం మార్గమని, రిలయన్స్ అంబానీ ప్రకటన చూస్తే మోడీ ప్రపంచంలోనే రాజకీయ చతురత కలిగిన నాయకుడని గొప్ప నాయకుడు అని అభినందించడం రిలయన్స్ ద్వారా 2040 నాటికి 35 లక్షల కోట్ల ఆదాయంలో ఉంటుందని చెప్పేసి అనటం మోడీ, అదాని, అంబానీలు అందలం ఎక్కించటం అంటేనే ప్రజల నెత్తిను భారాలు మోపుతూ ప్రజల్ని నష్టపరిచేటువంటి విధానాలే దీనికి కారణమని అన్నారు కాబట్టి మోడీ విధానాలని ప్రజలకు అర్థం చేయించి ప్రజలను చైతన్యపరిచే దానికోసం ఈ కార్మిక కర్షక సదస్సు ఉపయోగపడుతుందని, అందరూ కదిలి పెద్ద ఎత్తున ప్రచారం కొన సాగించాలని అన్నారు. మతం పేరుతో రాజకీయాల్ని విచ్ఛిన్నం చేసి మతానికి రాజ్యాంగబద్ధత కల్పించే దానికోసం ప్రయత్నాలు చేయటం ఇది దుర్మార్గమైనటువంటి పాలన అని, కాబట్టి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మూడు సంఘాల కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారంలో పాల్గొని మోడీ విధానాన్నిఎండగట్టే దానికోసం మోడీ మత ఉన్మాద రాజకీయాలను ప్రజలకు చెప్పి వారిని చైతన్య పరచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని, దానికోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఎన్. రాజు ఎం. చంద్రమోహన్ రైతుసంఘం అధ్యక్ష కార్యదర్శులు దుబ్బాక రామచందర్, మదుసుదన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి అంజయ్య కే జగన్, జగదీష్, కిషన్, సిహెచ్. జంగయ్య, ఏ కుమార్, రుద్ర కుమార్, శేఖర్, బ్రహ్మయ్య, ఎల్లేష్, కురుమయ్య, ముసలయ్య ,శేఖర్ రెడ్డి, జగన్, భాషయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి : బోసుపల్లి వీరేష్ కుమార్



ఇబ్రహీంపట్నం,మేజర్ న్యూస్ (జనవరి 19): తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి ఉద్యమించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషిచేసిన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటదని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులు బోసుపల్లి వీరేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అహర్నిశలు ఉద్యమించి జైళ్ళ పాలైన ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కేటాయించి వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యేనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగే విష్ణువర్ధన్, కన్వీనర్ వెంకటేష్ గౌడ్, కార్యదర్శి నరేందర్ గౌడ్, కొంతం యాదిరెడ్డి, డి శ్యామల, బాబూలాల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యం

### హెరిటేజ్ జోనల్ యజమాన్యం సత్యనారాయణ



కొందుర్గు, మేజర్ న్యూస్ (జనవరి 19 ) : పాడిరైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యం అని హెరిటేజ్ జోనల్ యజమాన్యం సత్యనారాయణ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని తిరుమల్‌దేవునిపల్లి గ్రామంలో పాడిరైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు పాల ఉత్పత్తితో అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. పాడి పశువులకు కావలసిన పోషక విలువలతో కూడిన పశువుల దానను వినియోగించుకుని నాణ్యమైన పాలఉత్పత్తిని పెంపోందించవచ్చని అన్నారు. హెరిటేజ్ ఫుడ్స్ లిమిటేడ్ అందిస్తున్న రైతురుణాలను ప్రతి ఒక్కరైతు వినియోగించుకోవాలని అన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతి పాడిరైతుకు రెండులక్షల ఉచిత ప్రమాద భీమా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సర్వోత్తమరెడ్డి, వెంకటేశమ్, రాఘవేందర్, సూపర్‌వైజర్ బానుచందర్, పాలసేకరణ ప్రతినిధి యాదయ్య, పాడిరైతులు, గ్రామస్తులు పాల్గోన్నారు.

# మాదక ద్రవ్యాలకు యువత ఆకర్షితులు కావద్దు

▶▶ రౌడీయిజం పూర్తిగా నిర్మూలిస్తాం ▶▶ సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం ▶▶ నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతాం మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి




జల్ పల్లి, మేజర్ న్యూస్ (జనవరి19):మాదక ద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కావద్దని, లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి.రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశానుసారం బాలాపూర్ మండల్ జల్ పల్లి మున్సిపాలిటీ షాహిన్ నగర్ టీఏంజి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి,ఏసిపి డి.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను నియంత్రణ గురించి ప్రజా ప్రతినిధులతో, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గంజాయి, డ్రగ్స్,మత్తు పదార్థాల నియంత్రణ అందరూ సామాజిక బాధ్యతగా భావించి స్వీకరించాలన్నారు. మాదకద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి ఇతర మత్తు పదార్థాలను నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు.గంజాయి మత్తు పదార్థాలు కలిపి విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పౌరుడు గంజాయి సాగు, సరఫరా, నిర్మూలనను సామాజిక బాధ్యతగా భావించి అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి మత్తు పదార్థాలు అమ్మకాలు వినియోగం వలన జరిగే పరిణామాలపై ప్రజలతో పాటు విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలని అన్నారు.గంజాయి మత్తు పదార్థాలు వాడటంతో యువత దొంగతనాలకు పాల్పడి,రౌడీలుగా మారి, మానభంగాలు చేసే ప్రమాదం పొంచి ఉందన్నారు.ఇటీవల కాలంలో చదువుకునే విద్యార్థులు గంజాయి డ్రగ్స్ కేసుల్లో నేరస్తులుగా మారుతున్నారని, జల్సాలకు అలవాటు పడి యువత డబ్బుల కోసం నేరాలకు పాల్పడి,తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గుర్తుచేశారు. వేరే ప్రాంతాల నుంచి ఇక్కడ వచ్చి రౌడీయిజం చేస్తే సహించబోమని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనీ తెలిపారు. మత్తు పదార్థాలు విక్రయించి,రౌడీలుగా చలామణి అవుతున్న ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించబడతారని అన్నారు. ప్రతి ప్రాంతంలో,కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాలాపూర్, పహాడీ షరీఫ్,జల్ పల్లి ప్రదేశాలను నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్ది,దేశంలోనే శాంతియుత ప్రదేశంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాలాపూర్ సిఐ వెంకట్ రెడ్డి, మహేశ్వరం సిఐ ముని, కందుకూరు సిఐ విశ్వనాథరెడ్డి, జల్ పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, రిప్రజెంటేటివ్ వైస్ చైర్మన్ యూసుఫ్ పటేల్, నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



# సేవా పురస్కారం అందుకున్న సదానంద స్వామి



కందుకూరు, మేజర్ న్యూస్ (జనవరి 19): నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ద్వారా స్వామి వివేకానంద సేవా పురస్కారం 2024 సంవత్సరానికి గాను కందుకూరు మండలం అన్నోజిగూడ గ్రామానికి చెందిన కాకి సదానంద స్వామి ముదిరాజ్ అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ లో ఫౌండేషన్ చైర్మన్ బత్తుల హేమంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, శాసనమండలి సభ్యులు దయానంద్ గుప్తా, ప్రముఖ సినీ నటులు, మాజీమంత్రి డాక్టర్ బాబు మోహన్ చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకున్నట్లు సాధానంద తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి : ఎంపీపీ ప్రభాకర్




బంట్వారం, మేజర్ న్యూస్ (జనవరి 19)ః వికారాబాద్ జిల్లా బంటారం మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ షాదీపురం ప్రభాకర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పనుల అభివృద్ధిని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన అధికారి సమావేశానికి రాకుండా క్రింది స్థాయి వర్క్ ఇన్స్పెక్టర్ను పలుమార్లు సమావేశానికి పంపియడంతో సభ్యులు మండిపడ్డారు. రొంపల్లి గ్రామ ఎంపీటీసీ శ్రీకాంత్ రెడ్డి మండలంలోని రోడ్ల దుస్థితి పై

### ఆర్అండ్ బి అధికారి సమావేశానికి రాకపోవడంతో మండిపడ్డ సభ్యులు

ఎన్నిసార్లు సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సంబంధిత ఏఈ సమావేశానికి రాకపోవడం ఎంతవరకు సమంజసం అని గట్టిగా నిలదీశారు. అనంతరం సభను ఉద్దేశించి ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో ప్రజల అవసరాలను సమస్యలను తెలుసుకోవడానికి సమావేశం నిర్వహిస్తున్నామని అలాంటి సమావేశానికి అధికారులు దుమ్మా కొట్టడం సరైన పద్ధతి కాదని ఆయా శాఖల అధికారులను హెచ్చరించారు. సరైన సమాచారంతో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని , సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలని అన్నారు. మరొకసారి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సంతోషరాజు, ఎంపీపీ ప్రభాకర్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీవో సుశీల్ కుమార్ షిండే, ఎంపీ ఓ విజయ్ కుమార్, ఎంఈఓ చంద్రప్ప, ఏవో సంధ్య, ఏపీవో సుధాకర్, ఏపీఎం దేవయ్య ఎంపీటీసీ శ్రీకాంత్ రెడ్డి, శరణ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- నేడు, రేపు నియోజకవర్గంలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు - కొడంగల్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్**

కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 19): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు నూతనంగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు గ్రామాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు అందుకు అవసరమయ్యే పత్రాలతో ఫారం-6లో నింపి పోలింగ్ కేంద్రాల్లో అధికారులకు అందించాలన్నారు. ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-8 ద్వారా సరైన పత్రాలు జతపర్చి పోలింగ్ కేంద్రాల్లో అందించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునే విధంగా రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.



# పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి విజయం సాధిద్దాం : మాజీ ఎమ్మెల్యే ఆనంద్



బంట్వారం, మేజర్ న్యూస్ (జనవరి 19)ః శుక్రవారం నాడు వికారాబాద్ జిల్లా,

### బంట్వారం మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లాపురం శ్రీనివాస్

పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బంట్వారం మండల పరిధిలోని మద్వాపూర్, సల్బత్తాపూర్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు, పార్లమెంట్ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రతి కార్యకర్త పట్టు వీడకుండా కష్టపడి పనిచేస్తే విజయం సొంతం అవుతుందని చేవెళ్ల నియోజకవర్గం ని కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవాలన్నారు, గ్రామాల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలు ఎవరు నిరుత్సాహ పడకుండా పనిచేసి విజయం సాధిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి

బషిరాబాద్, మేజర్ న్యూస్ (జనవరి 19)ః కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బషీరాబాద్ మండల పరిధిలోని కంసాన్ పల్లి, ఎక్మయి, అల్లపూర్, దామర్ చెడ్, వాల్య నాయక్ తాండ, నంద్యా నాయక్ తాండ, ఊరూరా జెండా ఆవిష్కరణ మరియు సన్మాన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధికి దూరం చేసిందని ముఖ్యంగా తాండూర్లో అభివృద్ధి కాగితాలకే పరిమితం అయిందని ఎన్నికల ప్రచారంలో పెద్దలు సోనియమ్మ ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేశారన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించడం జరిగిందని త్వరలో మిగిలిన గ్యారెంటీ పథకాలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటమని అన్నారు. అలాగే రానున్న 5 సంవత్సరాలలో ప్రతి గ్రామానికి విద్య, వైద్యంతో పాటు రోడ్ల నిర్మాణం చేసి ప్రజలకు మంచి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు రుణపడి ఉంటానని ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో తాండూరును అభివృద్ధిలో మోడల్గా నిలుపుతానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కలాల్ నర్సింహులు గౌడ్, జడ్పీటిసి శ్రీనివాస్ రెడ్డి, సోసైటి వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంతి బాయ్ రాములు నాయక్, సీనియర్ నాయకులు వెంకటేష్ మహారాజ్, రోహిత్ మహారాజ్, శంకరప్ప, మాధవ రెడ్డి , సిద్దు మదని, పవన్ ఠాకూర్, సాయిలు గౌడ్, మునీర్ పటేల్ , అబ్దుల్ ఖలీద్,సర్పంచులు నారాయణ, రాథోడ్ శివ, నర్సిరెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# కొర్రెముల పంచాయతీలో రికార్డుల తనిఖీ



ఘట్కేసర్ రూరల్, మేజర్న్యూస్(జనవరి 19) : మండలంలోని కొర్రెముల పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి సందర్శించి రికార్డులను తనిఖీచేశారు. రికార్డుల నిర్వహాణ, పంచాయతీకి సంబందించిన ఆధాయ వ్యయాల గురించి కార్యదర్శి కవితను అడిగితెలుసుకున్నారు. గ్రామంలో అక్రమనిర్మాణాలు ఏమైనా జరుగుతున్నాయా, ఇళ్ళ అనుమతులు ఏలా ఇస్తున్నారనే విషయాలపై అరా తీశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీలో అక్రమనిర్మాణాలు జరుగకుండ చూసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ నిర్వహాణ సజావుగా సాగేవిధంగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్గౌడ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**హస్నాబాద్ సర్పంచ్ బి.పకీరప్ప**



కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 19): ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హస్నాబాద్ సర్పంచ్ బి.పకీరప్ప అన్నారు. శుక్రవారం కొడంగల్లోని క్యాంపు కార్యాలయంలో కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి కుంచారం వెంకట్రెడ్డి చేతుల మీదుగా హస్నాబాద్కు చెందిన చెట్టుకిందిలక్ష్మీకి కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా మంజూరైన 1,0116 చెక్కును అందించారు.

# హుసేన్పూర్ గ్రామ పంచాయతీలో డీఎల్పీవో ఆకస్మిక పర్యటన



కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 19): కొడంగల్ మండలంలోని హుసేన్పూర్ గ్రామ పంచాయతీలో డీఎల్పీవో శంకర్నాయక్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో పర్యటించిన ఆయన ఇంటి పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని గ్రామ సర్పంచ్ అనంతమ్మ, పంచాయతీ కార్యదర్శి కె. కొండన్నకు సూచించారు. అదే విధంగా నర్సరీ, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.కొండన్న పాల్గొన్నారు.

# సీజ్ చేసిన ఇసుక వేలం వేసిన అధికారులు



బొంరాస్పేట్, జనవరి 19: అధికారులు సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ వెంకటేశ్ శుక్రవారం వేలం నిర్వహించారు. గత వారం రోజుల క్రితం మండలంలోని మహంతీపూర్లో అనుమతులు లేకుండా వాల్టా చట్టానికి విరుద్ధంగా నిల్వ చేసిన 20 ట్రాక్టర్ల ఇసుక డంపులను పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్ సిబ్బందితో కలిసి వేలం పాట నిర్వహించగా రూ.60500 ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవిచారి, గ్రామ సర్పంచ్ మైపాల్ పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర మాదక ద్రవ్య సరఫరాదారుల పట్టివేత





బాలాపూర్ మేజర్ న్యూస్(జనవరి 19); రాజస్థాన్ నుండి హైదరాబాదుకు డ్రగ్స్ ను బట్టలలో దాచి ప్రైవేటు బస్సులో రవాణా చేస్తున్న నిందితులను, ఎస్ ఓ టి ఎల్ బి నగర్ జోన్ బృందం, మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్షిణీ ఫంక్షన్ హాల్ వద్ద శుక్రవారం నాడు పట్టుకున్నారు. మీర్పేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితులు నరేంద్ర బిష్ణోయ్ అలియాస్ ప్రవీణ్ కుమార్, హేమా రామ్ పకరం దేవాస్ అలియాస్ ప్రకాశ రే, రాజస్థాన్ రాష్ట్రం బర్మేరా జిల్లాకు చెందినవారు. వీరు మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారని తరువాత వారు వాటిని సేకరించడం అవసరమైన వ్యక్తులకు సరఫరా చేయడం ప్రారంభించారని తెలిపారు. తద్వారా అక్రమ మార్గాల ద్వారా సులభంగా డబ్బు సంపాదించాలని రాజస్థాన్ కు చెందిన ఒక డ్రగ్ పెడ్లర్ తో పరిచయం ఏర్పరచుకొని హెరాయిన్ డ్రగ్ ను తక్కువ ధరకు ఒక గ్రామ్ కు 5000 నుండి 6000 వరకు, ఎం డి ఎం ఏ డ్రగ్స్ ఒక గ్రామ్ 2000 రూపాయల నుండి 4 వేల రూపాయల వరకు దానికి అవసరమైన వారికి భారీ ధరకు అంటే గ్రామకు పదివేల నుండి 12 వేల వరకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. రాజస్థాన్ నుండి హైదరాబాదుకు డ్రగ్స్ ను బట్టలలో ఉంచి ప్రైవేటు బస్సులో రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి 150.3 గ్రాముల హెరాయిన్, 32.1 గ్రాముల ఎం డి ఎం ఏ , రెండు ద్విచక్ర వాహనాలు 6 మొబైల్ ఫోన్లు 2500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన పెడ్లర్ మూలం పరీక్షకు అందుబాటులో లేరు పరారీలో ఉన్న నిందితులను పట్టు కోవడంతో పాటు వినియోగదారులను గుర్తించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్డిపిఎస్ చట్టం సెక్షన్ 31 ఏ ప్రకారం నిషేధిత మాదకద్రవ్యాలు మాదకద్రవ్యాలను సేకరించడం విక్రయించడం రవాణా చేయడం వినియోగించడం నేరమని పది సంవత్సరాల జైలు శిక్ష మరణశిక్ష విధించబడుతుందని విద్యార్థులకు ఇది ఒక విజ్ఞాపన అని ఈ విపత్తును అరికట్టడంలో పోలీసులకు సహాయం చేయాలని సమాజాన్ని కోరుతు.. పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు రాచకొండ ప్రత్యక్ష పర్యవేక్షణలో కే మురళీధర్, డి సి పి ఎస్ ఓ టి ఎల్ బి నగర్ మహేశ్వరం ఎస్ ఓ టి మీర్పేట్ పోలీస్ ఎస్ఐ భద్యా నాయక్ మీర్పేట్ సిబ్బంది మార్గదర్శకత్వంలో అరెస్టులు జరిగాయని పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ యాలాల శ్రీనివాస్



కందుకూరు, మేజర్ న్యూస్ (జనవరి 19): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యాలాల శ్రీనివాస్ పేర్కొన్నారు. వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బాచుపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల పైన ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ జ్యోతి పాండు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కాలైన ప్రధానమంత్రి కిసాన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను ప్రజలు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఈ విధంగా వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లవకుష్, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు విన్సెంట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, గ్రామ పెద్దలు భూపాల్ రెడ్డి, ఫాతిమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌కు శుభాకాంక్షలు



మహేశ్వరం, మేజర్ న్యూస్ (జనవరి 19): బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సేవెళ్ల మహేందర్ కు రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షులు టి.యాదీశ ఆధ్వర్యంలో జిల్లా యువమోర్చా నాయకులు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బూర దిలీప్ గౌడ్, శ్రీశైలం, రూపక్, అధికార ప్రతినిధి విజయ్, బస్వ రఘు గౌడ్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు యాదగిరి రెడ్డి, శ్రీనివాస్, శివ ప్రకాష్ రెడ్డి, భగీరథ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఏనుగు జంగారెడ్డి



కందుకూరు, మేజర్ న్యూస్ (జనవరి 19): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏనుగు జంగారెడ్డి శుక్రవారం ప్రగతి భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అందుగుల సత్యనారాయణ, మదన్ పాల్ రెడ్డి , శివగళ్ల యాదయ్య, సబావత్ నరేందర్, కప్పల రాజు, కాముల మహేష్, దేవేందర్, శ్రావణ్, తొండుపల్లి గిరి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వార్డుసభ్యుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జనవరి 18): మాడ్గుల మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డుసభ్యులు నర్సింగ్ యాదయ్య గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు మాడ్గుల ఎంపిటిసి, ఎంపిటిసిల ఫోరమ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త పాండుగౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు, సుద్ధపల్లి సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, మాడ్గుల మాజీ సర్పంచ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కాట్ల యాదయ్యగౌడ్, అందుగుల సింగిల్‌విండో డైరెక్టర్ కొప్పుల జగన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సూధిని శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిత్రపు అశోక్ తదితరులతో కలిసి బాధితుడిని పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని ఆసపత్రి వైద్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి కోరారు.

## పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి



కందుకూరు, మేజర్ న్యూస్ (జనవరి 19): మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో రైతుల సాగుచేసిన పంటలను శుక్రవారం రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు సోకుతున్న తెగుళ్ల గురించి రైతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అధునాతన పద్ధతులలో పంటలు సాగు చేయాలని, రైతులు సాగుచేసిన పంటలకు, ఇండ్ల తోటలకు ఎలాంటి పురుగు సోకిన వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి లకుమళ్ళ రాజు రైతులు ఉన్నారు.

## మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సదస్సు



బాలాపూర్ మేజర్ న్యూస్(జనవరి 19); హైదరాబాద్ చాప్టర్ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐ ఎస్ సి ఏ) కలకత్తా మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల సైదాబాద్ హైదరాబాద్ సంయుక్తంగా 18 జనవరి 2024 సస్టైనబుల్ ఫ్యూచర్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పై గ్లోబల్ పెర్స్పెక్టివ్ అనే అంశంపై జాతీయ సెమినార్ ను నిర్వహించారు. హైదరాబాదు చాప్టర్ ఐ ఎస్ సి ఎ కన్వీనర్ ప్రొఫెసర్ నాగరాజురావు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ దాని కార్యకలాపాలు సహకారాల గురించి ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రొఫెసర్ నాగరాజారావు మాట్లాడుతూ... హైదరాబాదు అధ్యాయం యొక్క ముఖ్య భావన ఏమిటి అంటే సైన్స్ యొక్క ప్రాముఖ్యత శాయ దృక్పథం శాయ జీవనం గురించి వారిని ప్రేరేపించడానికి వారికి అవగాహన కల్పించడానికి చేరు కోలేనిదినీన్నారు. 2023సం.. నాగపూర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐ ఎస్ ఎస్ ఏ తక్షణ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ విజయలక్ష్మి సక్సేన వచ్చారు. ఆమె జాతీయ సెమినార్ థీమ్ గురించి మాట్లాడారు.... గౌరవ అతిథి ప్రొఫెసర్ అశోక కుమార్ సక్సేనా, ఐ ఎస్ ఎస్ సి ఎ మాజీ అధ్యక్షులు ఈ సందర్భంగా ఆశీర్వచనాలు అందజేశారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రవేసర్ ఎం విద్యుల్లత ఈ వేడుకల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మాజీ డైరెక్టర్ డాక్టర్ ఏకే శ్రీ వాస్తవ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ హెచ్చోడి బి ఓ ఎస్ లో ఒక కీలక గమనిక అందించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హనుమంతరావు అతనికి స్వాగతం పలికారు. మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ ఐ ఎస్ సి ఎ 2 ఈసీ సభ్యులు డాక్టర్ కే సీతారాం బాబు, దయాన్సు కు స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈవెంట్ ను గ్రాండ్ గా సక్సెస్ చేయడంలో కీలక పాత్ర పోషించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జనవరి19):పండ్ల దుకాణాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న జంగయ్యకు 18వ తారీకు 11:30 గంటల సమయంలో పహాడి షరీఫ్ పండ్ల దుకాణల సమీపంలో ఓ వ్యక్తి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని డయల్ 100 కు కాల్ వచ్చింది. వెంటనే వారు పహాడీ షరీఫ్ పండ్ల దుకాణాల సమీపంలో సంఘటన స్థలానికి చేరుకొని, 55 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని గుర్తించి. 108 అంబులెన్స్ లో చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అతడిని పరీక్షించి, ఈసీజీ తీసిన తర్వాత 19వ తారీఖు 1: గంటలకు అతను మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. తర్వాత విచారణలో అతడు బిచ్చగాడు అని తెలిసింది. మరణించిన వ్యక్తి ముస్లిం కమ్యూనిటీ లా కనిపిస్తున్నాడని గుర్తించారు. కావున తగు చర్యలు తీసుకోవాలని స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని ఎస్ఐ డి శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.

# దేవాదాయ శాఖ ఆస్తులను ఎవరైనా ఆక్రమిస్తే శాఖపరమైన చర్యలు



తాండూర్ రూరల్ మేజర్ న్యూస్ (జనవరి 19)ః దేవదాయ శాఖకు చెందిన భూములను ఆక్రమించుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై శాఖపరమైన చర్యలు క్రిమినల్ కేసులు తప్పవని దేవదాయ శాఖ రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ అనిత హెచ్చరించారు. శుక్రవారం తాండూరు మండలం అంతారం గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం దస్తగిరి పేట గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవా లయానికి చెందిన భూములను కాపాడేందుకు దేవదాయ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## - క్రిమినల్ కేసులు చేయడం జరుగుతుంది
## - దేవదాయ శాఖ అడిషనల్ కలెక్టర్ అనితా

దేవదాయ శాఖ ఈవో శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆ శాఖ ప్రత్యేక బృందం దస్తగిరి పేట లోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములపై ఆరా తీశారు. ఆలయానికి చెందిన సర్వే నెంబర్లు 161, 162, 177, 179, 50 సర్వే నెంబర్లలో మొత్తం విస్తీర్ణం 57 ఎకరాల 29 గుంటల భూమి ఉందని తెలియజేసే విదంగా దేవదాయ శాఖ రెవెన్యూ విభాగం నేతృత్వంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అడిషనల్ కలెక్టర్ అనిత, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ మధుబాబు మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన భూమి (ఎండోమెంట్)కింద ఉన్న ఇట్టి ఆస్తులు శ్రీ వెంకటేశ్వర స్వామికి చెందినవిగా పరిగణిస్తూ నోటీస్ బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇట్టి భూమిపై సర్వహక్కులు దేవాదాయ శాఖకి చెందుతాయని తెలియజేశారు. ఎవరైనా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన అక్కడ ఎలాంటి క్రయవిక్రయాలు జరిపిన దేవదాయశాఖ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాస్, అంబరీష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసి కమిటీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్ :ఎంఈఓ చంద్రప్ప

కోటపల్లి, మేజర్న్యూస్(జనవరి 19): కోటపల్లి ,బంటారం మండలంలోని పాఠశాల యజమన్య కమిటీ ఎస్ఎంసి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ నేడు (20వ తారీకు) మండలంలోని ప్రతి పాఠశాలలో నోటీసు ఇవ్వడం జరుగుతుందని మండల విద్యాధికారి చంద్రప్ప ఒక ప్రకటనలో తెలిపారు. నేడు 20వ తేదీనే పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా కూడా నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. 22, 23 న తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి ఏమైనా ఉంటే పరిష్కరించడం జరుగుతుందన్నారు. 24 బుధవారం ఎస్ఎంసి సభ్యుల ఎన్నిక కొరకు తల్లిదండ్రుల తుది జాబితా ఖరారు చేసి జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. 29న ఎస్ఎంసి సభ్యుల ఎన్నిక ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1:30 కి ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎన్నికైన ఎస్ఎంసి సభ్యుల యొక్క మొదటి సమావేశాన్ని 29 వ తేది మధ్యాహ్నం రెండు గంటల నుండి 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి తరగతి నుండి ముగ్గురు చొప్పున తల్లిదండ్రులను ఎన్నుకుంటారు. ఇందులో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ, ఇంకొకరు బీసీ లేదా మైనారిటీ మూడో వ్యక్తి ఓసి ఈ ముగ్గురిలో ఇద్దరు మహిళలు కచ్చితంగా ఉండాలన్నారు.



ఈ విధంగా ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతులకు 15 మందిని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుండి ఏడు తరగతులకు 21 మందిని అదేవిధంగా హై స్కూల్ కి సంబంధించి 6 నుండి 8 తరగతిలో 9 మందిని సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరిలో నుండే చైర్మన్ వైస్ చైర్మన్ గా ఎన్నుకుంటారు. కాల పరిమితి రెండు సంవత్సరాలు వీరితోపాటు ఎక్సాపిషియో సభ్యులుగా స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు, సీనియర్ ఉపాధ్యాయుడు, ఏఎన్ఎం అంగన్వాడీ కార్యకర్త, ఇద్దరు కోఆపరేట్ సభ్యులు ఉంటారు. మండలం లో ఉన్నటువంటి ప్రధానో పాధ్యాయులు అందరికీ దీనిపై ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. 29వ తారీఖున ఎస్ఎంసి ఎన్నికను సజావుగా నిర్వహించి 30 వ తేది ఎన్నిక లిస్టును డీఈఓ ఆఫీసుకు అందించాలని మండల విద్యాధికారి చంద్రప్ప సూచించారు.

# 18 ఏళ్లు నిండిన వారు ఓటర్గా నమోదు చేసుకోవాలి

### తహసీల్దార్ ఆర్ మనోహర్ చక్రవర్తి



మోమిన్పేట్, మేజర్ న్యూస్ (జనవరి 19)ః 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల పూర్తి చేసుకున్న వారందరూ ఓటర్ జాబితాలో తప్పనిసరిగా తమ పేరును అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని తాహ సిల్దార్ ఆర్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 20.21న తేదీలలో శని వారం ఆదివారం స్పెషల్ క్యాంపైన్ దే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్ జాబితాలో పేర్లు నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఇందులో భాగంగా జనవరి01.2024 నాటికి 18 సంవత్సరాల పూర్తి చేసుకున్న యువతి యువకులు అందరు తప్పకుండా తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోగలరని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాలలో ముసాయిదా ఓటర్ జాబితా మరియు సంబంధిత పారాలు 6.7.8 లను ఉదయం 10 గంటల నుండి అందుబాటులో అధికారులు ఉంటారన్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదులో పాటు సవరణలు చిరునామా మార్పులు చేర్పులతో పాటు ఇతర క్లై యి ములు అభ్యంతరాలపై దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలలో సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి



కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 19)ఃగిరిజన ఆశ్రమ పాఠశాలలలో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, కుల్కచర్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శంకర్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సీఆర్టీ ఉపాధ్యాయులతో కలిసి ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నరసింహ రెడ్డి మరియు ఏడి సర్వేశ్వర్ రెడ్డిలను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏళ్ళతరబడి అందరు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలను చిన్నచూపుతో చూస్తున్నారని, నామమాత్రపు జీతాలు ఇవ్వడం మరియు వాటిని కూడ 4నెలలు, 5 నెలలకు ఒకసారి ఇస్తుండటంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖలలో అందరు ఉపాధ్యాయులకు ఏవిధంగా జీతాలు చెల్లిస్తున్నారో వీరికి కూడ ఆదేవిధానాన్ని అవలంబించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, దాస్యనాయక్ తాండ రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బొంరాస్పేట్ మండల అభివృద్ధికి అధికారుల ప్రణాళికలు



బొంరాస్పేట్, మేజర్ న్యూస్ (జనవరి 19): సీఎం రేవంత్రెడ్డి ఆదేశానుసారం బొంరాస్పేట్ మండల అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా అధికారులు బొంరాస్పేట్ మండల కేంద్రంలో పర్యటించి సర్పంచ్ జయమ్మతో కలిసి పీఆర్ డీఈ నాగేశ్వరచారి, ఏఈ రవికిరణ్లు అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామంలోని కాలనీల్లో పర్యటించి సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఐమాక్స్ లైట్స్, మార్కెట్ యార్డు, ఆర్అండ్బీ అతిథి గృహం, విద్యుత్ వ్యవస్థ, కమ్యూనిటి హాల్ల నిర్మాణం కోసం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సంగెపల్లి నర్సిములుయాదవ్, సీనియర్ నాయకులు వీరేశలింగం, ఉమాపతి, కిష్టప్ప, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ



కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 19): కళ్యాణలక్ష్మి చెక్కులను కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు అందించారు. శుక్రవారం కొడంగల్లోని క్యాంపు కార్యాలయంలో కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ ఆథారిటీ (కడా) ప్రత్యేకాధికారి కుంచాల వెంకట్రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీ.విజయ్కుమార్, ఎంపీపీ ముద్దప్పదేశ్ముఖ్, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పెద్దనందిగామ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు, నాయకులు రాములు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గౌరారం గోపాల్



బొంరాస్పేట్, మేజర్ న్యూస్ (జనవరి 19): ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గౌరారం గోపాల్ అన్నారు. శుక్రవారం బొంరాస్పేట్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో రాంరెడ్డి చేతుల మీదుగా నూతన సంవత్సరం క్యాలండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంప్లెక్స్ హెచ్ఎంలు హరిలాల్, పాపిరెడ్డి, శ్రీహరిరెడ్డి, వెంకట్, ఆ సంఘం జిల్లా నాయకులు నడిమింటి మల్లేశ్, రాజశేఖర్, లక్ష్మి, అలవేలు, నాగజ్యోతి, నరేందర్గౌడ్, అలీమోద్దీన్, గుంజ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



మర్పల్లి,మేజర్న్యూస్(జనవరి19)ఃమర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో మ్యాతరీ నర్సింహులు అనారోగ్యంతో బాధపడుతు గురువారం రాత్రి మృతి చెందాడు.అలాగే తుమ్మలపల్లి గ్రామంలో పసుల గల్యమ్మ అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందింది.అట్టి విషయం ఆయా గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి వారి అంత్యక్రియలకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున 10 వేలు పంపించగా పట్లూర్ లో ఎంపీటీసీ స్వప్న సురేశ్, తుమ్మలపల్లి పల్లిలో స్థానిక నాయకులు పాండు ముదిరాజ్ గ్రామస్తులతో కలిసి మృతుల ఇంటికి వెల్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్ పంపిన నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్లూర్లో కుంతేని దేవయ్య, రాజు, నిరంజన్, లాలు, తుమ్మలపల్లి లో పి. సురేష్, ఆ.రమేష్, ప్రశాంత్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా హత్య మిస్టరీని ఛేదించిన వికారాబాద్ పోలీసులు

## వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్, మేజర్ న్యూస్ (జనవరి 19): వికారాబాద్ మండలం, పులుమద్ది గ్రామంలో దారుణ హత్యకు గురైన మహిళ హత్య కేసును వికారాబాద్ పోలీసులు ఛేదించారు. వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం వికారాబాద్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.... గత సోమవారం పులుమద్ది గ్రామ సర్పంచ్ మాధవరెడ్డి గ్రామ శివారులలో గల ఒక చిన్న కాలువలో ఒక గుర్తు తెలియని మహిళ శవం సగం కాలి ఉన్నదని సమాచారం అందించారన్నారు. సమాచారం వచ్చిన వెంటనే వికారాబాద్ పోలీస్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఛేదించాలని వికారాబాద్ డిఎస్పి నర్సింహులుకి ఆదేశించినట్లు చెప్పారు. డిఎస్పి ఆధ్వర్యంలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శ్రీను, మోమిన్ పేట సిఐ ఆంజనేయులు , నవాబ్ పేట్ ఎస్ఐ భరత్ భూషణ్, ధారూర్ ఎస్ఐ సంతోష్ కుమార్, మర్పల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, ఐటి సెల్ అధికారులతో కలిపి 4,5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా దర్యాప్తు మొదలు పెట్టడం జరిగిందన్నారు. దర్యాప్తులో భాగంగా టెక్నికల్ ఆధారాలు, సీసీటీవీ ఆధారాలు సేకరించి వాటిని విశ్లేషిస్తూ, వివిధ పోలీస్ స్టేషన్లకు గుర్తు తెలియని మహిళలకు సంబంధించిన దొరికిన ఆధారాలతో లుక్ అవుట్ నోటీసులను పంపించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తేదీ బుధవారం చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో ఒక మహిళ మిస్సింగ్ కేసు నమోదు అయిందన్నారు. అట్టి కేసు యొక్క వివరాలు తీసుకోని తప్పిపోయిన మహిళ వివరాలు, గుర్తుతెలియని మహిళ శవం యొక్క వివరాలు పరిశీలించి మృతురాలి కుటుంబీకులతో చర్చించామన్నారు. చేవెళ్ల పోలీస్స్టేషన్ లో మిస్సింగ్ అయిన మహిళ, పులుమద్ది గ్రామంలో హత్యకు గురైన మహిళనే అని నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. కేసు పరిశోధనలో భాగంగా మృతురాలు యొక్క కుటుంబీకుల నుంచి సేకరించిన సమాచారం మేరకు మృతురాలికి అవుసుపల్లి బాబు అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని తెలిసిందన్నారు. వారు తరచూ ఫోన్లో మాట్లాడి కలుసుకునేవారన్నారు. నిందితుడు అవుసుపల్లి బాబును గురువారం రాత్రి తన ఇంటి దగ్గర ఉండగా అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. నేరస్థుడు మృతురాలితో గత మూడు నాలుగు సంవత్సరాల నుండి అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, అప్పుడప్పుడు ఆమెకు డబ్బులు ఇచ్చేవాడని, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా మృతురాలు



ఇవ్వకపోవడంతోపాటు మృతురాలు మరోకరితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానంతో మృతురాలిని చంపాలని నిర్ణయించుకున్నాడని ఆయన వివరించారు. నేరస్తుడు అవుసుపల్లి బాబు మృతురాలు ఎర్రోళ్ల అనుసూజను మాయ మాటలు చెప్పి పులమద్ది గ్రామ శివారులోకి తీసుకువచ్చి మద్యం తాపీ తను వేరే వాళ్ళతో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానించి, ఆమెతో గొడవకు దిగి ఆమె ముఖంపై పిడిగుద్దులు గుద్ది తరువాత ఆమె చీర కొంగుతో మెడకు బిగించి హత్య చేసినాడన్నారు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకుని పక్కన ఉన్న చిన్న కాలువలోకి తోసివేసి ఎవరు గుర్తుపట్టకుండా ఉండుటకు ఆమె ముఖంపై చీర కప్పి తన వెంట తెచ్చుకున్న అగ్గిపెట్టతో అంటించి మృతదేహన్ని కాల్చి అక్కడి నుండి పారిపోయాడన్నారు. పోలీస్ అధికారులు ఆవుసులపల్లి బాబు చెప్పిన విషయాలను టెక్నీకల్, సీసీటీవీల ద్వారా సేకరించిన ఆధారాలను పరిశీలించి, అతని దగ్గర మృతురాలికి సంబంధించిన పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరస్థునిపైన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత 2016వ సంవత్సరంలో ఒక మర్డర్ కేసు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి అవుసుపల్లి బాబు తన పేరును,చిరునామా మార్చుకుంటూ తిరుగుతున్నాడని తెలిపారు. జిల్లా ప్రజలు కూడా తమ జీవన ప్రయాణంలో తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే జీవించాలని, చుట్టూ ప్రక్కల ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే పోలీస్ అధికారులకు తెలుపాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిఎస్పి నర్సిములు, సిఐలు టంగుటూరి శ్రీను, ఆంజనేయులు, ఎస్ఐలు అనిత, సంతోష్ కుమార్, భరత్భూషన్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాలలో అవకతవకల గురించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



బాలాపూర్ మేజర్ న్యూస్(జనవరి 19);

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బి ఎం సి లో నూతనంగా కేటాయించిన రేషన్ దుకాణంలో అవకతవకలు జరుగుతున్నాయని కార్పొరేటర్ అనిత ప్రభాకర్ (ప్రభు) జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్ పేట్ రేషన్ దుకాణాలలో నూతనంగా ఏర్పాటుచేసిన వాటిలలో అవకతవకల జరిగాయని 21వ డివిజన్ కార్పొరేటర్ అనిత ప్రభాకర్ పలువురు నాయకులతో కలిసి ఎం ఆర్ ఓ, ఆర్డి ఓ, జిల్లా కలెక్టర్ లకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... బడంగ్ పేట్ కు చెందిన గత కొన్ని సంవత్సరాలుగా బడంగ్ పేట్ లో ఒక రేషన్ దుకాణం కేటాయించారని జనాభా పెరగడంతో కార్డు హోల్డర్లు సంఖ్య పెరగడంతో రేషన్ షాపు ల సంఖ్య నాలుగు పెరిగిందని, గత ప్రభుత్వం ఈ షాపులను మంజూరు చేసిందని చాలా సంతోషకరమన్నారు. కానీ కొత్తగా ఏర్పాటు చేసిన దుకాణాలలో అవినీతి బంధుప్రీతి రాజకీయ జోక్యం ఏర్పడి నిజమైన అర్హులను గుర్తించకుండా అట్టి రేషన్ దుకాణాలను గుర్తించడానికి స్థానిక కార్పొరేటర్లకు కుటుంబాలకు చెందిన వారికి కేటాయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇది రేషన్ యాక్ట్ ప్రకారం నేరమని బడంగ్ పేట్ కు కొత్తగా మంజూరు అయినా 22, 23, 24, 25 దుకాణాలను తిరిగి మరో మారు విచారణ జరిపించి నిర్ధారణ చేయాలన్నారు. వాటిని రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ వేసి నిజమైన స్థానిక పేద నిరుద్యోగ మహిళలైన అర్హులను గుర్తించి వారికి దుకాణాలు కేటాయించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో పాటు కందుకూర్ ఆర్డిఓ కు బాలాపూర్ ఎం.ఆర్.ఓ లకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరుపేదలకు సహకరించాలని ఉద్దేశంతో విజ్ఞప్తి చేస్తూ ఈ ఫిర్యాదు చేసినట్లు కార్పొరేటర్ బి అనిత రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

**జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి**







వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్న్యూస్(జనవరి19):ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా 18 - 19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శుక్ర వారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వీ.సీ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ....ఈ నెల 20 , 21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్ళు పూర్తి చేసుకున్న యువతీ, యువకులందరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిర్ణీత 6 , 7 , 8 దరఖాస్తు ఫారాలతో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటరు ముసాయిదా జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు చేపట్టాల్సి ఉన్నట్లయితే, వాటిని సరిచేసుకునేలా చూడాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా గుర్తించిన అంశాలను పరిగణలోకి తీసుకొని డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను, సిమిలర్ ఫోటో ఎంట్రీ, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ ఓటర్లను గుర్తించడం జరిగిందని, అలాంటి వారికి నోటీసులు పంపించి ఓటరు జాబితా నుండి అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తుది జాబితాలో ఏ ఒక్క డూప్లికేట్ పేరు ఉండకుండా క్షుణ్ణంగా పరిశీలన జరపాలని సూచించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల కోసం వెంటనే ప్రింటింగ్ కోసం సమగ్ర వివరాలతో జాబితాను పంపించాలని ఎన్నికల విభాగం అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నివాస ప్రాంతానికి రెండు కిలోమీటర్లకు పైబడి దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లయితే, వాటి వివరాలు తెలియజేయాలని సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25 న విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, వికారాబాద్, తాండూర్ ఆర్డీవోలు విజయ కుమారి, శ్రీనివాస రావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జరిగే గ్రామ సభలను జయప్రదం చేయండి : ఎంపీడీవో వెంకటమ్మ




ఇబ్రహీంపట్నం,మేజర్ న్యూస్ (జనవరి 19): నేటి నుంచి మండలంలో పలు గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటమ్మ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు 2024-25 ఆర్థిక సంవత్సరం గాను గ్రామపంచాయతీ ప్రణాళిక రూపొందించుటకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు గ్రామ సభలు చర్ల పటేల్ గూడెం, దండుమైలారం ,నాగంపల్లి,పోచారం ,పోల్కంపల్లి, రాయపోల్ ,తుర్కగూడ ,తులేకలాన్ ,ఉప్పరి గూడ- .అలాగే 22వ తేదీ నుండి కప్పపహాడ్, కర్ణంగూడ, ముకునూరు, ఎలిమినేడు తోపాటు నెర్రపల్లి గ్రామంలో 23వ తేదీ వరకు గ్రామసభలు జరగనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలకు ముఖ్య అతిథులుగా ఎంపీపీ కృపేష్ తోపాటు ప్రజాప్రతినిధులు సర్పంచులు గ్రామపంచాయతీ కార్యదర్శులు హాజరుకానున్నారని తెలిపారు.

# సంచలనాత్మక కథనాలను ప్రచురిస్తున్న ఏకైక పత్రిక సూర్య : ఎంపీపీ వీర్లపల్లి రజితరాజమల్లారెడ్డి

- నిఖార్సయిన వార్తలతో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండడం అద్భుతం : సర్పంచ్ వీర్లపల్లి గీతభాగ్యరెడ్డి

- సూర్య దినపత్రిక 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీపీ, సర్పంచ్



మేడ్చల్, మేజర్ న్యూస్ (జనవరి 19) :సూర్య దినపత్రిక 2024 క్యాలెండర్ ను మేడ్చల్ మండల ఎంపీపీ వీర్లపల్లి రజితరాజమల్లారెడ్డి, డబిల్ పూర్ గ్రామ సర్పంచ్ వీర్లపల్లి గీతభాగ్య రెడ్డి శుక్రవారం సూర్య దినపత్రిక క్యాలెండర్ ను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీర్లపల్లి భాగ్యరెడ్డితో కలిసి మండలంలోని డబిల్ పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీర్లపల్లి రజితరాజమల్లారెడ్డి, డబిల్ పూర్ గ్రామ సర్పంచ్ వీర్లపల్లి గీతభాగ్యరెడ్డిలు మాట్లాడుతూ సూర్య దినపత్రిక ఎన్నో సంవత్సరాలుగా సంచలనాత్మక కథనాలను ప్రచురిస్తూ సమగ్రంగా వార్తలను ప్రజలకు చేరవేస్తోందని ఎంపీపీ, సర్పంచ్ తెలిపారు. అసలైన, నిఖార్సయిన వార్తలతో సుదీర్ఘకాలంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండడం అద్భుతమన్నారు. కోవిడ్, లాక్ డౌన్ సమయలోనూ కీలకంగా విధులు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనదైన పంథాను కొనసాగిస్తూ ప్రజల్లో చిరకాలంగా నిలిచి పోయిందన్నారు. తొలి తెలుగు పత్రికగా ప్రజల గుండెల్లో నిలిచి, తెలంగాణ సాధన కోసం ప్రజల వెంట ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండీ గౌస్, ఎంపీటీసీ దుద్దు హేమలతఅరుణ్, ఉప సర్పంచ్ ఎర్ర సత్యనారాయణ, వార్డు సభ్యులు కొమ్ము శ్రీనివాస్, కుమ్మరి రేణుకా శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, వీర్లపల్లి రామోదర్ రెడ్డి, చుంచు సరితశ్రీనివాస్, తాళ్ల హరిప్రసాద్, దుద్దు అశ్విని, కోఆప్షన్ సభ్యులు పెంజర్ల గంగారాంలతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీరాం రెడ్డి, తలారి అశోక్ ముదిరాజ్, వరుణ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# పథకాలను అందరికీ చేర్చడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(జనవరి,19):కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరువయ్యేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ఫామిలీ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీ జి ఏ రఘు వంశీ అన్నారు.శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ ప్రాంతంలో ఎన్టిఆర్ సర్కిల్ వద్దకు చేరుకుంది,ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి ఎ రఘువంశీ భారత ప్రభుత్వం తరఫున విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ యాత్ర సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి చేరుతుందన్నారు. ముఖ్యంగా పీఎం ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎంజీఎన్ఆర్ఈజీఏ, వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ సంబంధిత పథకాలపై ఈ ఆడియో విజువల్ వ్యాన్లు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో ఈ యాత్ర 2024 జనవరి 26 వరకు కొనసాగనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు 100 శాతం అందచేయడమే సంకల్ప్ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్, పీఎం ఉజ్వల యోజన, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరువ చేయడం, అవగాహన కల్పించడంపై ఈ యాత్ర దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని వివిధ మునిసిపాలిటీస్ (జిఎచ్ఎమ్సి) ప్రాంతాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర 26 జనవరి 2026 వరకు కొనసాగుతుంది అని తెలిపారు.






గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా: టి రఘునాథ స్వామి మాట్లాడుతూజిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరఫున ఆరోగ్య శిబిరాల్లో ఏర్పాటు చేసిక్రింది కార్యకలాపాలు నిర్వహించబడుతున్నాయి అని తెలిపారు.ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, క్షయవ్యాధి కోసం రోగుల స్క్రీనింగ్ లక్షణాల కోసం స్క్రీనింగ్, కఫం పరీక్ష నిర్వహించబడుతుందని, ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ ,టిబి తో బాధపడుతున్న రోగుల కోసం నిక్షయ్ మిత్రస్ నుండి సహాయం పొందడం కోసం సమ్మతి తీసుకోబడిందని అన్నారు. నిక్షయ్ పోషణ్ యోజన () కింద, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా టిబి రోగులకు ద్రవ్య సహాయం అందించబడుతుందని పేర్కొన్నారు.నాన్–కమ్యూనికేబుల్ డిసీజెస్ లు హైపర్‌టెన్షన్ మరియు డయాబెటిస్ కోసం అర్హులైన జనాభా స్క్రీనింగ్ చేయబడుతోందని, మరియు పాజిటివ్‌గా అనుమానించబడిన కేసులకు మందులు అందించబడుతాయని లేదా ఉన్నత కేంద్రాలకు సిఫార్సు చేస్తారని జిల్లా డిఎం అండ్ హెచ్ వో డా.రఘు నాథ స్వామి తెలిపారు.

# ఆడపిల్లనను రక్షించండి..చదివించండి

బాలికలను చదివిస్తేనే మహిళా సాధికారత : జెండర్ స్పెషలిస్ట్ వాసవి



షామిర్ పేట,మేజర్ న్యూస్( జనవరి, 19):మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు.శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని బొమ్మరాశి పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడుతూ... మహిళలు,బాల బాలికలు వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి స్వతహాగా నిర్ణయాలు తీసుకొనే స్థాయికి ఎదగడమే మహిళ సాధికారత అని అన్నారు. బాలికలు,యువతులు, మహిళలపై జరిగే హింసల పట్ల అందరు అవగాహన కలిగి ఉండాలని, ఇళ్లలో జరిగే హింసలు, బయట ఎదురయ్యే హింసలు, అత్యాచారాలు మరియు పని ప్రదేశాలలో మహిళలు ఎదురుకుంటున్న లైంగిక, శారీరకంగా, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు లోనైనప్పుడు వారు ఆందోళన చేయకుండా ధైర్యంగా ముందుకు వచ్చి వారి సమస్యను చెప్పుకొని పరిష్కరించుకునేలా ప్రతి మహిళ ముందుకు రావాలని, వారి సమస్యలు చెప్పుకోవడానికి మహిళ హెల్ప్ లైన్ 181ఉందని చెప్పడం జరిగింది. అంతేకాకుండా ఈ సమావేశంలో సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ముద్ర లోన్స్, స్టాండ్ అప్ ఇండియా స్కీం, గృహహింస చట్టం, పోక్సో చట్టం, హెల్ప్ లైన్ నంబర్స్ 1098,14567 లపై అవగాహన కల్పించారు.ఈ నెల జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని కూడా తెలిపారు. ఈ సమావేశంలో జెండర్ స్పెషలిస్ట్ శ్రావణి మరియు స్వయం సహాయక సంఘా సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్మీ స్పోర్ట్స్ కంపెనీలలో...బాలుర అడ్మిషన్‌ల కొరకు దరఖాస్తులు ఆహ్వానం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(జనవరి, 19): ఆర్మీ స్పోర్ట్స్ కంపెనీలో బాలుర అడ్మిషన్స్ కొరకు ఆర్మీ స్పోర్ట్స్ కంపెనీ,కేంద్రీయ విద్యాలయం మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్ , బెంగళూర్ లలో ప్రవేశాలకు 8 ఏళ్ల నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు, 3వ తరగతి ఉత్తీర్ణులై, బాక్సింగ్, హాకి, స్విమ్మింగ్, సైలింగ్ క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పథకాలు సాధించిన బాలురు దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బి. బలరామారావు తెలిపారు. వచ్చే నెల 5న, కేంద్రీయ విద్యాలయం మద్రాస్ గ్రూప్, బెంగళూర్ సెంటర్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఉదయం 6 లకు పేరు నమోదు కేసుకోవాలన్నారు.అభ్యర్థులు తమ జనన, కుల, నివాస ధ్రువీకరణ పత్రం, స్పోర్ట్స్ అచీవ్మెంట్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఆరు పాస్ పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్స్, భద్రత హామీ పత్రము, స్వభావ ధ్రువీకరణ పత్రం, పోటీలలో పాల్గొనుటకు వ్యక్తిగత ప్లేయింగ్ కిట్ తీసుకు వెళ్ళాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరములకు ఈ కింద ఇచ్చిన సెల్ నెంబర్లను సంప్రదించాల్సి ఉంటుంది.స్విమ్మింగ్ – 9567345347,బాక్సింగ్ – 7892766021,సైలింగ్ – 7019397105,హాకి – 7204793183, ఏంపికైన వారికి ఉచిత భోజనం, శిక్షణ, ఉన్నత విద్య, వసతి సదుపాయం ఉంటాయని బల రామారావుపేర్కొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్పూర్తితో ముందుకుసాగుదాం

★తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల ఛైర్మన్ గా బస్వరాజు శంకర్



శమీర్ పెట్, మేజర్ న్యూస్:సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్పూర్తితో రజకులందరు హక్కులకై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ బస్వరాజు శంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర రజక సంఘం సమావేశం జిల్లాలోని శామీర్పేట కట్ట మైసమ్మ ఆలయం వద్ద జరిగింది. సమావేశంలో భాగంగా రజక నూతన కమిటీ రాష్ట్ర చైర్మన్ గా బస్వరాజు శంకర్ ను ఏకగ్రీవంగా రాజకీయాలకు అతీతంగా సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక సంఘము హక్కులకై, అభివృద్ధికి కృషి చేస్తానని తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ చైర్మన్ ఆకరాజ్ శ్రీనివాస్, కొన్నే సంపత్, బర్లపాటి జయ రాం,కోట్ల శ్రీనివాస్, దుబ్బాక రమేష్, కుమార స్వామి, కనకయ్య, జూపల్లి సాయిలు, జూపల్లి రవి, పంజగారి ఆంజనేయులు, పోతరాజు రాములు, పూసలు సంపత్, చంద్రమౌళిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



దళిత బంధం సాధన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను శుక్రవారం హైదరాబాద్ లో కలిశారు. దళిత బంధు ఐడీలు, ప్రొసీడింగ్స్ వచ్చిన లబ్ధిదారులకు వెంటనే నిధులను విడుదల చేసి దళిత కుటుంబాలలో వెలుగులు నింపాలని కోరారు. దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ధర్నాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి వికారాబాద్ జిల్లా కన్వనర్ ఎరన్ పల్లి శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు దేవినోని గూడ వెంకటన్న, రామన్న మాదిగ, ముజాహిద్పూర్ పెంటన్న, కో కన్వీనర్స్ డప్పు శ్రీనివాస్, చౌడాపూర్ అశోక్, చిగురాల్పల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 19)

## ప్రముఖ కార్డియాలజీ వైద్యులు ప్రమోద్ కుమార్‌ని కలిసిన కార్పొరేటర్



కాప్రా,మేజర్‌న్యూస్ః నగరంలోనే ప్రముఖ కార్డియా లజీ విభాగ వైద్యులు డాక్టర్ ప్రమోద్ కుమార్ ని శుక్రవారం చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యోనారాణో హరి.దేవుళ్లతో సమానంగా వైద్యులను కొలుస్తారు.వైద్య రంగంలో సేవలందిస్తు వైద్య వృాఎత్తికే వన్నె తెస్తున్నారని,ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రస్తుత రోజుల్లో ఆహారవు అలవాట్ల వల్ల చిన్న వయసులోనే గుండె సంబంధిత రోగాల బారిన పడిన వారికి భరోసా కల్పిస్తు అవగాహన కలిగిస్తు.రోగుల మన్ననలు అందుకుంటూ వైద్య రంగంలో ముందుకు సాగుతున్న ప్రమోద్ కుమార్ మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆమె కోరారు.

# 21న వనస్థలిలో భజే శ్రీ రామం

### - శ్రీ రామ నామాలతో నగర సంకీర్తన

### - శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃఅయోధ్య శ్రీ రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ముందు రోజు ఈనెల 21న ఆదివారం సాయంత్రం 5. 30 గంటల నుండి శ్రీ స్వరలయ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వనస్థలిపురం వారి ఆధ్వర్యంలో లక్ష్మి హెల్త్ కేర్ హాస్పిటల్, టిట్బస్ అండ్ సామ్స్ కిచెన్ వనస్థలిపురం వారి సౌజన్యంతో భజే శ్రీ రామం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సువర్చల ఆంజనేయ స్వామి దేవాలయం టి.వి కాలనీ నుండి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం హిల్ కాలనీ వరకు శ్రీ రామ నామాలతో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయము హిల్ కాలనీలో సహస్ర దీపాలంకరణ, సహస్ర గళార్చన, శ్రీ రామచంద్రమూర్తికి స్వర, నృత్య, దీపార్చన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయని భక్తులు, కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని తెలిపారు.

## అనేక దేశాల నుండి అయోధ్యకు చేరుకుంటున్న బహుమతులు



హైదరాబాద్, మేజర్ న్యూస్:: అయోధ్యలో రామమందిర ప్రారం భోత్సవానికి కొద్ది రోజుల సమయం ఉండటంతో, ప్రపంచ వ్యాప్తంగా బహు మతులు పవిత్ర నగరానికి చేరుకోవడం ప్రారంభించాయి. దీనితో పాటు, ఇతర దేశాలు కూడా తమ హిందూ డయాస్పోరా ఈ ప్రారంభోత్సవాన్ని జరువుకునేలా చర్యలు తీసుకుంటున్నాయి, జనవరి 22వ తేదీని కేవలం భారతీయ వేడుకగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా జరువుకునేలా చేసింది. ఇండిక్ ఆలోచన, సాంస్కృతిక గొప్పతనం అనేది దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలను ఒకచోట చేర్చే నేపథ్య ప్రాంతం. నేపాల్, శ్రీలంక, థాయ్లాండ్ వంటి దేశాలు అయోధ్యకు ముఖ్యమైన బహుమతులను పంపడం, ఈ ప్రాంతంలో భాగస్వామ్య గుర్తింపును ప్రదర్శించడం వంటివి మనం చూడడానికి ఇది కూడా ప్రధాన కారణం. నేపాల్‌లోని జనక్‌పూర్‌లోని సీత జన్మస్థలం నుండి లార్డ్ రాముని కోసం ఉద్దేశించిన 3,000 కంటే ఎక్కువ బహుమతులు విజయవంతంగా అయోధ్యకు చేరుకున్నాయి. వెండి బూట్లు, ఆభరణాలు, దుస్తులు వంటి వస్తువులతో కూడిన ఈ విభిన్నమైన సమర్పణలు గత వారం నేపాల్లోని జనక్పూర్ ధామ్ రామజానకి ఆలయం నుండి అయోధ్యకు సుమారు 30 వాహనాల కాన్వాయ్లో రవాణా చేయబడ్డాయి. అదనంగా, అయోధ్య అశోక్ వాటికా నుండి ఒక ప్రత్యేకమైన బహుమతిని కలిగి ఉన్న శ్రీలంక నుండి ప్రతినిధి బృందాన్ని కూడా అందుకుంది. రామాయణ ఇతిహాసంలో ప్రస్తావించబడిన వురాణ గార్డెన్ అశోక్ వాటికా నుండి ఒక రాయిని ప్రతినిధులు సమర్పించారు, ఇక్కడ సీతను రావణుడు బందీగా ఉంచాడు. భారతదేశంతో చారిత్రక సాంస్కృతిక అనుబంధానికి ప్రసిద్ధి చెందిన థాయ్‌లాండ్, అయోధ్యలో జరిగే పవిత్రోత్సవం కోసం అయుతయ నుండి ప్రత్యేక మట్టిని కూడా పంవుతుంది. అటువంటి సంజ్ఞ భారతదేశం మరియు థాయ్లాండ్ మధ్య బలమైన సాంస్కృతిక సంబంధాలను వునరుద్ఘాటిస్తుందని వరల్డ్ హిందూ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, గ్లోబల్ ఛైర్మన్ స్వామి విజ్ఞానానంద పేర్కొన్నారు.నిజంగా ఈ వేడుకను విశ్వవ్యాప్తం చేసే విషయం ఏమిటంటే, ఆలయంలో రామ్లాలా జలాభిషేకం కోసం, దక్షిణ కొరియా, చైనా, కజకస్తాన్, ఇరాన్, సురినామ్, కెనడా, రష్యాతో సహా 156 దేశాల నుండి పవిత్ర జలం పంపబడుతోంది. అందువల్ల, భారతదేశం యొక్క శ్రీరాముని వేడుక సరిహద్దులను దాటి, ప్రపంచం నలుమూలల నుండి ప్రజలను ఏకతాటిపైకి తీసుకువస్తుందని స్పష్టంగా తెలుస్తుంది.

# యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

### -మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం - ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(జనవరి, 19): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 20, 21వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ గౌతం తెలిపారు. ఈ దిశగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కానివారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదుకు, చిరునామా తదితర సవరణల గురించి జిల్లాలో రెండు రోజులపాటు స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ గురించి చేసిన షెడ్యూల్లో ఈ స్పెషల్ క్యాంపెయిన్ దే నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా సంబందిత ఫారం (6 మరియు 8) లతో ఈ రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్ నమోదుకు, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పు, సవరణలు ఇతర అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతం కోరారు.

# సంస్కృతి కళాశాలలో విదేశీ విద్యపై కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం






ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(జనవరి, 19)ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల, టెక్నాలజీ విదేశీ విద్యపై కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ కై వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ సెషన్ తో శుక్రవారం కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. క్యాంపస్ లో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కోసం అంకితమైన కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ తమ సహకారాన్ని ప్రకటించినట్లు సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా యూఎస్ఏ లోని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ నుండి మార్కెటింగ్ రిక్రూట్మెంట్ మేనేజర్ ఫారిన్ డెలిగేట్ నస్బానామ్, సీఈఓ నిరూపమా దాస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి అవసరమైన ముందస్తు సమగ్ర జ్ఞానాన్ని అందించేందుకు ఇది ఎంతగానో తోడ్పడనుందన్నారు.అర్హులైన విద్యార్థులకు స్కాలర్షిప్ అందించడం, చేరికలు, మెరిట్ ఆధారిత అవకాశాలను పెంపొందించడానికి వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోసంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్ రెడ్డి, సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఉదయకిరణ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్,విద్యార్థులు పాల్గొన్నారు.

## మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్తు సరఫరా లో అంతరాయం : ఏ ఈ శ్రీనివాస్

హైదరాబాద్, మేజర్ న్యూస్ :

చక్రిపురం 33/11 కె.వి. సబ్ స్టేషన్ నుండి వెలువడే అయ్యప్ప కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల చెట్ల కొమ్మలను కత్తిరించడం ,వేలాడే తీగలను సరిచేయు పనుల కారణంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రాంతంలో 20/01/2024 శనివారం ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్తు సరఫరాను ఆపివేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీర్ బి. శ్రీనివాస్ తెలియచేశారు. అందుమూలముగా విద్యుత్తు సరఫరా లో అంతరాయం కలిగే ప్రభావిత ప్రాంతాలు.శశాంక్ ఎన్క్లేవ్, భవానీ నగర్,గాయత్రి నగర్, లక్ష్మి నగర్ కృష్ణా థియేటర్ రోడ్, బాలాజీ నగర్ కాలనీ, సాయిబాబా దేవాలయం పిఎస్ రావు నగర్ కాలనీ, దమ్మాయిగూడ ప్రధాన రహదారి తిరుమల గార్డెన్స్ వరకు ఉంటుందన్నారు.11 కె.వి శివానందవురి ఫీడర్ 33/1 కె.వి నాగారం సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుండి 4.30 వరకు విద్యుత్తు నిలిపి వేయబడునని. ఇ.శ్రీనివాస్ తెలియ చేశారు.ప్రభావిత ప్రాంతాలు రాంపల్లి ఎక్స్ రోడ్ నుండి ఐకాన్, శివానందవురి కాలనీ, ప్రగతి నగర్, వాయుశక్తి నగర్ అండ్ ఇందిరమ్మ కాలనీ, ఆర్ సి ఎంక్లేవ్, ఎన్క్లేవ్ అండ్ ఎల్ ఎన్ ఆర్ కాలనీ,రోజ్ ప్రైడ్ కాలనీ నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించడం కోసం చేస్తున్న పనుల కారణంగా తాత్కాలికంగా ఏర్పడే ఈ అంతరాయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ బి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## ఇంద్రగంటి జానకిబాలకు సుశీలా నారాయణ రెడ్డి సాహితీ పురస్కారం..

ముషీరాబాద్/రవీంద్రభారతి మేజర్ న్యూస్

రసమయి/ సుశీలా నారాయణ రెడ్డి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యం లో సుశీలా నారాయణ రెడ్డి సాహితీ వురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జానకి బాల కు రవీంద్రభారతిలో ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు ప్రదానం చేయ నున్నారు.మంత్రులు జూపల్లి కృష్ణారావు /ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు.

ఈమేరకు రసమయి డాక్టర్ ఎం. కే. రాము/ సి.గంగా - సుశీలా నారాయణ ట్రస్ట్ ఓ ప్రకటనలో తెలిపారు.డాక్టర్ కేవీవర ప్రసాద్ రెడ్డి - శాంతా బయోటిక్స్ /వీసీ ఎల్లూరి శివారెడ్డి /డాక్టర్ జె.చెన్నయ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. 1984నుండి ఈ వురస్కారాలు ఇస్తున్నామని తెలిపారు.

డాక్టర్ కె.రామా చారి శిష్యుల సంగీత కార్య క్రమం గీతాల ఆలాపన ఉంటుందని తెలిపారు.ఈ వురస్కారాలను అందుకున్న సాహితీ వేత్తలు కూడా ఈ వేడుకల్లో పాల్గొనడం విశేషంగా చెప్పవచ్చు.